బి. శ్రీవల్లీ రాధిక

# ప్రెసెంటేషన్

"ఇంక నే వెళ్తానోయ్" అతను ముప్ఫయ్యోసారి చెప్పాడు.

"ఊఁ. సాయంత్రం త్వరగా వచ్చేయండీ!" గారాలొలికే గొంతుతో ఆమె నలభయ్యోసారి చెప్పింది.

వింటూన్న జానకికి నవ్వొచ్చింది. రోజూ యిదే తంతు. అతను మొదటిసారి వెళ్తాను అని చెప్పడానికీ, చివరికి వెళ్ళడానికీ మధ్య కనీసం అరగంట అయినా తేడా వుంటుంది. ఆ అరగంటా విన్నపాలు, వేడుకోళ్ళు.. గారాలు.. అలకలు, అభయాలు.. అన్నీ జానకికి వినపడుతూనే వుంటాయి.

అతను బయటకి వచ్చి స్కూటర్ తీస్తున్నాడు. ఆమె కూడా అతని వెనకాలే వచ్చింది. గులాబీ రంగు నైటీలో చాలా ఆకర్షణీయంగా వుంది.

ఇద్దరూ జానకిని చూసి యిబ్బందిగా నవ్వారు.

అతను స్కూటర్ స్టార్ట్ చేస్తుంటే ఆమె కుడిచేయి నడుము మీద పెట్టుకుని దిగులుగా నిలబడింది. ఎడమచేత్తో అతని క్రాఫ్‌ని సర్దింది. ఆ ఒక్క సెకనులోనే అతని చేయి ఆమె నడుముని తడమడం జానకి దృష్టిని దాటిపోలేదు.

అతను వెళ్ళగానే ఆమె మెల్లగా వెనుతిరిగింది.

"పనయిపోయిందా!" పలకరింపుగా అడిగింది.

"ఆఁ" బదులిచ్చింది జానకి.

"మీవారు వెళ్ళిపోయారా!"

"ఆఁ"

ఆమె ఒక్కక్షణం తచ్చాడి "ఇపుడే వస్తానూ" అంటూ లోపలికి వెళ్ళింది.

కొత్తగా వచ్చారు వాళ్ళిద్దరూ ప్రక్కపోర్షన్‌లోకి. స్వప్న, సుధీర్. రెండేళ్ళక్రితం పెళ్ళయ్యిందట. కానీ నిన్నో మొన్నో పెళ్ళి చేసుకున్న వాళ్ళలా కనిపిస్తారు.

చాలా ముచ్చటగా వుంటుంది జానకికి వాళ్ళని చూస్తే. ఒకళ్ళకోసం మరొకరు బ్రతుకుతున్నట్లుగా వుంటారు.

ముఖ్యంగా అతను. పొరపాటున కూడా ఆమెని విసుక్కోడు. ఆమె అలగడం అయితే రోజుకు నాలుగుసార్లన్నా జరుగుతుంది. నాలుగుసార్లూ అతను అరగంటకి పైగా బ్రతిమాలుకుంటాడు.

ఆయింట్లో జరిగే ప్రతీ విషయమూ జానకికి స్పష్టంగా వినపడుతుంది. వినబడకూడదని కూడా వాళ్ళేమీ అనుకోరేమో! జానకి డ్రాయింగ్ రూమ్‌లో వున్నంతసేపూ వాళ్ళూ డ్రాయింగ్ రూమ్‌లోనే వుంటారు. జానకి పెరట్లో పని చేసుకుంటుంటే వాళ్ళూ పెరటి వైపే కూర్చుంటారు.

మొదట్లో జానకికి చాలా యిబ్బందిగా అనిపించేది. వాళ్ళు వున్నంతసేపూ అటువైపు వెళ్ళకుండా వుండేందుకు ప్రయత్నించేది. వీలయ్యేది కాదు. ఆతర్వాత తర్వాత అలవాటు అయిపోయింది. ఇపుడు అదే మంచి కాలక్షేపం.

మూర్తికి యిలాంటి సరదాలేమీ లేవు. అతను కూడా జానకిపై ఎపుడూ కోపగించుకోడు. అయితే అలిగితే బ్రతిమలాడడాలు, వేడుకోవడాలు.. యిలాంటివేమీ అతని దగ్గర లేవు.

అసలు అలిగే అవకాశమే తనకి ఎప్పుడూ రాదు. తన యిబ్బందులు ఏమిటో, యిష్టాలేమిటో తనకంటే అతనికే బాగా తెలుసు. అన్నీ అడగక ముందే అతను చేసిపెడుతుంటే ఆనందించడమే కానీ అలగడం ఎలా జరుగుతుంది!

ఎపుడైనా అభిప్రాయభేదాలు వచ్చినా తను "ఇలా చేద్దామండీ" అంటుంది. "నీమొహం. నీకు తెలీదులే. ఇది యిలాగే చేయాలి." అంటాడతను. ఎందుకలా చేయాలో వివరంగా చెప్తాడు కూడా. చిత్రంగా తనకు నిజమేననిపిస్తుంది.

"ఈయన చెప్పిందే బాగున్నట్లుందే! ఈ పనిని యింత బాగా చేయచ్చా!" అని తను ఆశ్చర్యపోయి చూస్తూండగానే ఆపని అయిపోతుంది.

ఎప్పుడూ.. ఎప్పుడూ అంతే.

"ఇలా కాదు. ఈసారి ఏదైనా విషయానికి ఉట్టి పుణ్యానికి ఆయనతో పోట్లాట పెట్టుకోవాలి. చచ్చినా ఆయన చెప్పినదానికి ఒప్పుకోగూడదు. తనే గెలవాలి. గెలిచి తీరాలి.."

తన ఆలోచనలు ఎలా సాగుతున్నాయో అర్థమవగానే జానకి పెదవులపై మనోహరమైన చిరునవ్వు మెరిసింది.

" లోపలికి రావచ్చా!" స్వప్న మాట వినబడింది గడప దగ్గర.

"రండి. రండి." చేతిలోని వైరు ప్రక్కన పెడుతూ ఆహ్వానించింది.

"ఫ్లవర్ వేజ్ అల్లుతున్నారా! "

"ఊఁ"

"మొన్నటి పెయింటింగ్ అయిపోయిందా!" సోఫాలో కూర్చుంటూ ప్రశ్నించింది స్వప్న.

"ఇంకా లేదు. దాన్ని మధ్యలో ఆపి ఈపని చేస్తున్నాను."

కాసేపు అసహనంగా గడిపాక మెల్లగా చెప్పింది స్వప్న "మీరు.. మీరు నాకో సహాయం చేయాలి."

"సహాయమా!" జానకికి అర్థం కాలేదు.

"అవునండీ. రేపు మామారేజ్‌డే. సుధీర్‌కి ఏమైనా ప్రజంట్ చేయాలనుకున్నాను. కానీ నా దగ్గర ప్రస్తుతం అస్సలు డబ్బుల్లేవు."

"ఓ. అప్పుకావాలా! ఏం కొనాలనుకుంటున్నారు!" హుషారుగా అడిగింది జానకి.

"అహ. అప్పు కాదు. అప్పు కాదు" తడబడింది స్వప్న. "నా దగ్గర ఒక పెయింటింగ్ వుంది కదా! అది అమ్మేద్దామని"

జానకి వులిక్కిపడింది. "అయ్యో! అదేమిటండీ! మీకు ఆ పెయింటింగ్ అంటే చాలా యిష్టం కదా!" అప్రయత్నంగా అడిగింది.

"ఇష్టమే. కానీ సుధీర్ కంటే ఎక్కువ కాదుగా!" స్వప్న నవ్వింది.

జానకికి ఏదో గొప్పవిషయం అర్థమయినట్లు అనిపించింది. మళ్ళీ అంతలోనే ఏమీ అర్థం కానట్లూ తోచింది.

"నా దగ్గర తీసుకోవచ్చును కదండీ. తర్వాత తీర్చేయండి." అని చెప్పింది మెల్లగా.

"కాదులెండి. నాకు అలా అప్పు చేయడం యిష్టం వుండదు. మీరు కాస్త తోడు రాగలరా! బజారుకి వెళ్ళి, అది అమ్మేసి, వేరే ఏమైనా కొనుక్కుని వచ్చేద్దాం"

"అలాగే" తలవూపింది జానకి.

"నేను రెడీ అవుతాను మరి" హుషారుగా బయటకి వెళ్ళబోయి, గడప దగ్గర ఒక్క క్షణం ఆగింది స్వప్న. వెనక్కి తిరిగి సందేహంగా అడిగింది "ఈ విషయం సుధీర్‌కి చెప్పరుగా!" అని.

"చెప్పను" అన్నట్లు తలవూపింది జానకి.

ఆమెకి చాలా ఆశ్చర్యంగా అనిపించింది. స్వప్న అలా అడిగినందుకు కాదు. రెండ్రోజుల క్రితం సుధీర్ కూడా యిలాగే అడిగాడు.. అచ్చం యిలాగే..

ఆరోజు.. స్వప్న వాళ్ళ ఫ్రెండ్ యింటికి వెళ్ళింది. మూర్తి ఆఫీసుకి వెళ్ళాడు. జానకి తన అలవాటు ప్రకారం పెయింటింగ్ వేసుకుంటూ కూర్చుంది.

అప్పుడు వచ్చాడు సుధీర్. గడప దగ్గర నిలబడి సందిగ్ధంగా పిల్చాడు "జానకిగారూ!" అంటూ.

జానకి ఆశ్చర్యపోతూ ఆహ్వానించింది.

"మీరు నాకో సహాయం చేయాలి!" అన్నాడు అతను కూడా యిలాగే సందిగ్ధంగా.

ఏమిటని అడిగింది జానకి.

"మామారేజ్‌డే వస్తోంది. స్వప్నకి చీర కొందామంటే సమయానికి

డబ్బులేవు. మీరు.. మీరు.. కాస్త ఈ వుంగరం అమ్మి పెడతారా!" చేతికి వున్న బంగారపు వుంగరం తీసిస్తూ అడిగాడు.

జానకి నివ్వెరపోయి చూస్తుంటే తలవంచుకుని చెప్పాడు. "నేనే అమ్మొచ్చు. కానీ నాకు యివన్నీ సరిగా తెలీవండీ. ఎక్కడ అమ్మాలో! ఎలా అమ్మాలో!.. అసలా లెక్కలేమిటో!"

చిన్నపిల్లాడిలా కనిపించాడు అతను జానకి కళ్ళకి. పెద్ద పెద్ద పువ్వులున్న క్రిమ్షన్ కలర్ షర్టు, ఉంగరాల జుట్టు..

"పాపం!" అనిపించింది. రెండో నిమిషంలో సందేహం కలిగింది.. "చిన్నపిల్లాడేమిటి! మూర్తి వయసే వుంటుందేమో యితనికి కూడా. అయినా అతను "నాకు తెలీదండీ" అంటుంటే చాలా సహజంగా వుంది.

మూర్తి యిలా అంటాడా ఎపుడైనా!" జానకి ఆలోచనలో పడింది. "నాకు తెలీదండీ.. నాకు తెలీదండీ.." ఉహు. ఆమె వల్ల కాలేదు. మూర్తి అయితే "నాకు తెలీదండీ" అని ఎలా అంటాడో ఎంత ప్రయత్నించినా జానకి ఊహించలేక పోయింది.

అమాయకంగా చూస్తున్న సుధీర్ని చూస్తే కొంచెం నవ్వు కూడా వచ్చింది. "బయట తిరిగే మీకు తెలీకపోతే యింట్లో కూర్చునే దాన్ని నాకెలా తెలుస్తుందండీ!" అందామనుకుంది.

కానీ అనలేకపోయింది. అతన్ని చూస్తే నిజంగానే "పా.. పం" అనిపించింది. మూర్తికి చెప్పలేదు. ఉంగరం ఎలా అమ్ముతారో రీసెర్చి చేయబోయే దానిలా తనే బయటకి వెళ్ళి, ఆ ఉంగరం అమ్మేసి, చీర కొనుక్కుని వచ్చింది.

ఇప్పుడు.. మళ్ళీ స్వప్న కోసం పెయింటింగ్ అమ్మాలి.

జానకికి యిదంతా చాలా తమాషాగా అనిపిస్తోంది. "ఎంత బాగుంది యిలా ఒకరికొకరు ఏమైనా ప్రెజంట్ చేసుకోవడం! తాము ఎప్పుడూ యిలా వుండలేదు. అసలు మూర్తికి యింతవరకూ తన చేతుల్తో తాను ఏమీ

యివ్వలేదు. అసలు అలాంటి ఆలోచన కూడా తనకి ఎప్పుడూ రాలేదు."
స్వప్న రాగానే యిద్దరూ కలిసి బయటకి వెళ్ళారు. ఆమె అనుకున్నట్లుగానే పెయింటింగ్ అమ్మేసి, సుధీర్ కోసం మంచి షర్ట్ కొన్నారు.
ఆరోజు రాత్రి మూర్తి భోజనం చేసి నడుం వాల్చగానే, అతని ప్రక్కన కూర్చుని జరిగినదంతా చెప్పింది జానకి.
మొత్తం చెప్పాకగానీ గమనించలేదామె, మూర్తి తన జడతో తాపీగా ఆడుకుంటున్న విషయం.
గమనించాక జడ విసురుగా లాక్కుంటూ అడిగింది. "నే చెప్పిందేమయినా విన్నారా!"
అతను తలవూపాడు.
" ఏం విన్నారు! చెప్పండి."
మూర్తి కంగారు పడ్డాడు. "విన్నానోయ్. కానీ నాకేం అర్ధం కాలేదు."
జానకికి నవ్వూ, కోపం రెండూ వచ్చాయి. అతని వైపు సీరియస్‌గా చూసి ముసుగు పెట్టుకు పడుకుంది.

*****

మర్నాడు ప్రొద్దున త్వరగా మెలకువ వచ్చింది. మూర్తి అప్పటికే లేచి ఏదో వ్రాసుకుంటున్నాడు. వాకిట్లో ముగ్గు పెడుతూ అనుకుంది జానకి. "వీళ్ళు లేచారో లేదో! ఇవాళేగా వీళ్ళ పెళ్ళిరోజు!" అని.
అనుకుంటూండగానే సుధీర్ వచ్చాడు. జానకి అతని ప్రక్కనుండి లోపలికి వస్తుంటే మెల్లగా అన్నాడు. "జానకిగారూ! నేనిలా ఉంగరం అమ్మిన విషయం స్వప్నకి పొరపాటున కూడా చెప్పకండీ" అని.

జానకి నవ్వింది. అప్పటికి అయిదుసార్లు చెప్పాడు అతనా విషయం.

"చెప్పనండీ. రహస్యాలు దాచడంలో నేను చాలా గొప్పదాన్ని" ధైర్యం చెప్పింది.

"నిజంగా చెప్పలేదుగా మీరు!" మళ్ళీ సందిగ్ధంగా అడిగాడు.

"నిజంగా చెప్పలేదు."

దూరంగా కిటికీలోనుంచి మూర్తి నవ్వుతూ చూస్తున్నాడు. అది గమనించిన జానకి గబగబా లోపలికి వచ్చేసింది. స్నానం, వంటా.. ఆ పనిలో పడిపోయింది.

మూర్తికి భోజనం పెడుతూండగా వచ్చింది స్వప్న పెరటివైపు నుంచి. డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్న మూర్తి "ఆవిడ వచ్చినట్లున్నారు. చూడు." అన్నాడు.

జానకి వంటగదిలోకి వెళ్ళింది. స్వప్న కూడా ఆమాట చెప్పటానికే వచ్చింది. పెయింటింగ్ అమ్మినట్లుగా సుధీర్‌కి తెలియనీయవద్దన్న మాట. చెప్పనని జానకితో మరోసారి వాగ్దానం చేయించుకుని వెళ్ళింది.

నవ్వుకుంటూ యివతలి గదిలోకి వచ్చిన జానకిని చూసి "ఏమిటట!" అన్నాడు మూర్తి.

జానకి చెప్పింది వాళ్ళ భయం గురించి.

మూర్తి నవ్వాడు. "పోనీ చెప్పేయరాదూ పాపం!" అన్నాడు.

"ఎందుకు!"

"నువ్వు చెప్పాలనే కదా వాళ్ళు అన్నిసార్లు "చెప్పొద్దండీ!" అంటూ గుర్తు చేయడం!"

"అదేమిటి!"

"అంతే మరి. అంత కష్టపడి ఒక పని చేస్తే, ఆ కష్టం రెండోవాళ్ళకి తెలియకపోతే ఏం లాభం చెప్పు. నీకేమో అర్థం కాదు."

అతను అలా వెక్కిరించడం చూసి జానకికి కోపం వచ్చింది.

"చాల్లే వూరుకోండి. వాళ్ళిద్దరికీ ఒకరంటే మరొకరికి చాలా ప్రేమ. దాన్ని యిలా ప్రకటించుకుంటున్నారు. అదికూడా తప్పేనా!" అంది.

"తప్పు కాదు" ఒప్పుకున్నాడు మూర్తి. " ప్రేమని ప్రకటించుకోవడం తప్పు కాదు. కానీ జానకీ! వాళ్ళు ప్రకటిస్తున్నది ప్రేమని కాదు. తాము గొప్ప ప్రేమికులమన్న భావాన్ని. ఇంకా చెప్పాలంటే అహంభావాన్ని." చేయి కడుక్కోవడానికి లేస్తూ అన్నాడు.

"మొన్నటివరకూ ఒకరికొకరు చెప్పుకునేవారు. ఇపుడు నీదాకా వచ్చింది. వింటే, నమ్మితే రేపు నాక్కూడా చెప్తారు."

జానకి మాట్లాడలేదు. మూర్తి ఏమైనా చెప్తే దానికి భిన్నంగా ఆలోచించడం ఆమెకి యింతవరకూ తెలీదు. కానీ ఈసారి మాత్రం అంత తొందరగా అతను చెప్పినదానికి ఒప్పుకోదలచుకోలేదు.

తలవంచుకుని చెప్పింది. "నమ్మకపోవడాలూ, అనుమానాలూ అక్కర్లేదు. వాళ్ళు నిజంగా గొప్ప ప్రేమికులే. రోజంతా వాళ్ళని గమనించేది నేను. మీరు కాదు."

మూర్తి భుజాలు కుదించాడు "ఏమో నాకు మాత్రం వాళ్ళది నిజమైన ప్రేమలా తోచదు. నాటకంలా అనిపిస్తుంది." అన్నాడు ఖచ్చితంగా.

ఒక పిచ్చివాడ్ని చూసినట్లూ చూసింది జానకి అతన్ని "నాటకమా!"

"ఆ. లేకపోతే ఏమిటి చెప్పు. అతను బంగారపు వుంగరం అమ్మేసి చీర కొనడమేమిటీ! ఆ అమ్మాయి బంగారంలాంటి బొమ్మ అమ్మేసి చొక్కా కొనడమేమిటీ! పోనీ ఆ ఏడుపేదో వాళ్ళిద్దరే ఏడ్చుకోక మధ్యలో నిన్ను ఫూల్‌ని చేయడమేమిటీ!" అతని కళ్ళల్లో ఆపుకుందామనుకున్నా ఆగని నవ్వుని చూసి జానకి మొహం ఎర్రబడింది.

"పోండి అసలు. నాకు మీరంటే అసహ్యం." ఉక్రోషంగా అరిచింది.

మూర్తి నవ్వాడు. ఆమె తలమీద చిన్నగా తట్టి "నీమొహం" అన్నాడు. ఆతర్వాత చెప్పులు వేసుకుని బయటకి వెళ్ళిపోయాడు.

*****

అతను వెళ్ళిపోయినా జానకి ఉక్రోషం చల్లారలేదు. అన్నం కూడా తినకుండా మంచంపై వాలిపోయింది.

ప్రక్క పోర్షన్‌లోనుంచి మాటలు వినపడుతున్నాయి. అతను ఆఫీసుకి వెళ్ళలేదు కాబోలు. టేప్‌రికార్డర్ పెట్టారు. ఏం పిండివంటలు చేస్తూందో! తియ్యటివాసన తేలివస్తూంది. చెవులదిరిపోయే పాటల వెనుకనుంచి వాళ్ళ మాటలూ, నవ్వులూ మధురంగా వినిపిస్తున్నాయి. జానకి అసహనం యింకాస్త ఎక్కువయ్యింది.

ఒక్క ఉదుటున మంచం దిగి యింటికి తాళం వేసింది.

స్వప్నని పిలిచి తాళంచెవి యిచ్చింది. "ఆయన వస్తే యివ్వండీ. నేను మా అమ్మా వాళ్ళింటికి వెళ్తున్నాను" అని చెప్పింది.

"ఎప్పుడొస్తారు!" అంది స్వప్న.

"చూస్తాను. ఇవాళ మాత్రం రాను" చిరునవ్వుతో చెప్పి వెనక్కి తిరిగింది.

రోడ్డు చివరివరకూ నడిచింది. ఒక్క రిక్షా కూడా లేదు. ఆటో మాట్లాడబోతే " ముప్పై రుపాయలివ్వండి" అన్నాడు వాడు సీరియస్‌గా. వళ్ళు మండిపోయింది.

ఆ ఎండలోనే యింకొంత దూరం నడిచింది. రోహిణీకార్తె ఎండ. సెగలు చిమ్ముతోంది. జానకిలోని అసహనం అంతకుమించి చెమటలు కక్కుతోంది. పదిహేను నిమిషాలు నడిచాక "ఎందుకిప్పుడు అక్కడికి వెళ్ళడం!" అనిపించింది.

అంతే. ఒక్కసారిగా వెనక్కి తిరిగి యింటిముఖం పట్టింది. ఇంట్లోకి అడుగు పెడుతూండగానే బాదం చెట్టు నీడ చల్లగా స్వాగతం చెప్పింది.
తాళంచెవి కోసం తలుపుతట్టబోయింది జానకి. లోపలినుండి మాటలు వినిపించాయి.
"...ఉంగరం ఎందుకు అమ్మారండీ!" బాధగా అడుగుతోంది స్వప్న.
జానకి ఉలిక్కిపడింది. "స్వప్నకి ఎలా తెలిసింది!" ఆశ్చర్యంగా చెవులు రిక్కించింది.
"ఇదిగో.. యిందుకే నీకసలు చెప్పొద్దనుకున్నాను.. నువు నాకోసం పెయింటింగ్ అమ్మలేదూ!" సుధీర్ అంటున్నాడు.
ఈసారి జానకి ఉలికిపడలేదు. "నేను కూడా మీకు చెప్పొద్దనే అనుకున్నా.. కానీ ఏమిటో మళ్ళీ చెప్పేశా." అన్న స్వప్న మాటలు విని వెనుతిరిగింది.
అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళి మల్లెపందిరి దగ్గర బండ మీద కూర్చుంది. "ఎంత కరెక్ట్‌గా చెప్పారీయన!" ఆశ్చర్యంగా అనుకుంది.
ఆమెకిపుడు అంతా అర్ధమయింది.
"వాళ్ళు ఆ వస్తువులు అమ్మినది గత్యంతరం లేక కాదు. తాము గొప్ప ప్రేమికులమనీ, అవతలి వాళ్ళకోసం తాము చాలా కష్టపడ్డామనీ చాటుకోవడం కోసం. తనతో ఆ విషయాలు చెప్పింది కూడా అందుకే. తనద్వారా అవి రెండోవాళ్ళకి తెలియాలని. తను చెప్తుందేమోనని చూసి చూసి, చెప్పకపోవడంతో చివరికి వాళ్ళే ఒకరికొకరు చెప్పేసుకున్నారన్నమాట."
తల్చుకుంటుంటే జానకికి నవ్వొచ్చింది.
"..వాళ్ళు ప్రకటిస్తున్నది ప్రేమని కాదు. తాము గొప్ప ప్రేమికులమన్న అహంభావాన్ని." మూర్తి మాటలు మనసులో మెదిలాయి. ప్రొద్దున అతనితో తాను ఎలా మాట్లాడిందీ గుర్తొచ్చింది. "మీరంటే నాకసహ్యం" అనడం.. అతను "నీమొహం" అనేసి వెళ్ళిపోవడం...

బి. శ్రీవల్లీ రాధిక

గుండెల్లో దిగులు బంతిలా కొట్టుకుంది. కాళ్ళ చుట్టూ చేతులు పెనవేసుకుని మోకాళ్ళపై గడ్డం ఆన్చుకుని కూర్చుంది.

సాయంత్రం మూర్తి వచ్చేవరకూ అలాగే కూర్చుంది, గేటు వైపే చూస్తూ. అతను గేటు తెరుచుకుని లోపలికి వస్తూంటే కూడా కదలలేదు. అతన్నే తదేకంగా చూస్తూండిపోయింది. బావి దగ్గరకి వెళ్ళి కాళ్ళు కడుక్కుంటూ అడిగాడతను "అక్కడ కూర్చున్నావేమిటి!" అని. జానకి మాట్లాడలేదు. తాపీగా లేచి నిలబడింది. ఆతర్వాత సుడిగాలిలా వెళ్ళి అతన్ని చుట్టేసింది. కుడిచేత్తో బావి గట్టు పట్టుకుని ఆవేగాన్ని తట్టుకున్నాడు మూర్తి. ఎడమచేత్తో ఆమెని మరింత దగ్గరికి తీసుకుంటూ అడిగాడు "ఏమైంది!"

జానకి మెల్లగా తలెత్తింది. ఆమె బుగ్గల్లో, కళ్ళల్లో నవ్వు విరగబూస్తోంది. అతని మెడ చుట్టూ వున్న తన చేతుల్ని మరికాస్త బిగిస్తూ చెప్పింది. "ఐ లవ్ యూ."

తల పైకెత్తి ఫక్కున నవ్వాడు మూర్తి. ఆకాశంలో చందమామ సిగ్గుపడేలా.. జానకి తనని తాను మరిచిపోయి అతని గుండెల్లో ఒదిగిపోయేలా.

*****

("స్వాతి" సపరివారపత్రిక - 19.08.1994)